సాక్షి
ఏలూరు

సోమవారం । 1 । జనవరి । 2024



కృష్ణావతార అలంకరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూనీలా సమేత జనార్దనస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి శ్రీకృష్ణావతార అలంకరణ చేశారు.



ఘనంగా అన్నసమారాధన

పాలకొల్లు అర్బన్: మండలంలోని నాగరాజుపేటలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద షష్ఠి ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు



పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, పాలపొంగళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలి

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్



ఏలూరు(మెట్రో) : నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులకు ఆదివారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరంలో ఏలూరు జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. జిల్లాలో మంచి పంటలు పండి, విద్యా, పారిశ్రామిక పరంగా కూడా మంచి అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కరోనా దరి చేరకుండా మాస్కులు ధరించడం, శుభ్రతను పాటించడం వంటి అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కొత్త సంవత్సరంలో మరింత అభివృద్ధి

కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ



దెందులూరు: నూతన సంవత్సరంలో నవరత్న పథకాల అమలతో పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరింత అభివృద్ధి, సంక్షేమం చేస్తారని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఆదివారం ఎంపీ కార్యాలయంలో నూతన సంవత్సరం రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులతో పాటు ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం అభివృద్ధి, సంక్షేమం నూరు శాతం అందాలని ఆకాంక్షించారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలని ఎంపీ కోరారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో) : రాష్ట్ర స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతి పొంది జాతీయ స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌కు ఎంపికైన చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్, జిల్లా సైన్సు అధికారి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి తిరువీధి సేవలు



ద్వారకాతిరుమల : చినవెంకన్న క్షేత్రంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు, ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి తిరువీధి సేవలు ఆదివారం వైభవోపేతంగా జరిగాయి. ధనుర్మాసం సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవమూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించి హారతులిచ్చారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ తిరువీధి సేవ నేత్రపర్వంగా జరిగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారు ఉభయ దేవేరులతో క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఊరేగారు. ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది.

విద్యుత్ ఈఈగా వెంకటేశ్వర రావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు సర్కిల్ పరిధిలో ఏలూరు క్వాలిటీ కంట్రోల్ -4 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా టీ.వెంకటేశ్వర రావును బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ ఇమ్మడి పృథ్వీతేజ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో పర్చేజెస్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న వీ.సత్య సాయిబాబాకు పదోన్నతి కల్పించి విశాఖపట్నంలో టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమించారు.

మళ్లీ మురిపించేన్

- జనవరి నుంచి రూ.3000 పింఛన్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- అదనంగా పింఛనుదార్లకు రూ.5.84 కోట్ల లబ్ధి
- ఏలూరు జిల్లా వ్యాప్తంగా 2,33,726 మందికి ప్రయోజనం
- ప్రతి నెలా మొత్తం రూ.85.94 కోట్ల లబ్ధి

కొత్త సంవత్సరంలో పింఛన్‌దారుల మోముల్లో కొంగొత్త ఆనందాల్ని నింపుతూ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని రూ. 3 వేలు చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తానిచ్చిన హామీని అమలు చేస్తూ వృద్ధులు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, మత్స్యకారులకు పింఛన్ మొత్తాన్ని కొత్త ఏడాది నుంచి రూ.3,000 చేశారు. టీడీపీ హయాంలో కేవలం రూ. వెయ్యి పింఛన్ సరిపోక ఇబ్బంది పడిన లబ్ధిదారుల ఇక్కట్లు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి రాగానే పింఛన్‌ను రూ.2,250 చేశారు. ఇప్పుడు రూ.3 వేలకు పెంచడంతో పింఛనుదారుల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయి.

ఏలూరు (టూటౌన్) : అంచెలంచెలుగా పింఛన్ పెంపును కొనసాగిస్తామని చేసిన వాగ్దానాన్ని అమలుజేస్తూ 2024 జనవరి నుంచి రూ. 3,000 పింఛను మంజూరుకు ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ తీసుకోవాలంటే తెల్లవారుజాము నుంచే పంచాయతీల వద్ద పడుగాపులు పడాల్సి వచ్చేది. వృద్ధులు అవస్థలు పడుతూ పింఛన్ సొమ్ము కోసం ఎండ, వానలో కార్యాలయాల వద్ద ఎదురు చూడాల్సి వచ్చేది. నాలుగైదు రోజులు తిప్పుకునేవారు. ఇప్పుడు తెల్లవారకముందే వలంటీర్లు పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందిస్తున్నారు. వృద్ధులు టీడీపీ హయాంలో నెలవారీ ఖర్చులకు ఇబ్బంది పడేవారు. మందులకు, ఇతర అవసరాలకు డబ్బులు సరిపోని దుస్థితి ఉండేది.



ఏలూరులో పింఛన్లు అందజేస్తున్న వలంటీరు(ఫైల్)

ఇప్పుడు పింఛన్ మొత్తాన్ని మూడింతలు చేయడంతో వారి ఖర్చులకు పోనూ మిగతా సొమ్మును దాచుకుంటున్నారు.

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 2,78,519 మంది పింఛన్‌దారులకు ప్రతి నెలా రూ.77.31 కోట్లు అందిస్తున్నారు. జనవరి 2024 నుంచి జిల్లాలో అన్నిరకాల పింఛన్‌దారులు, కొత్తగా పింఛన్లు 9,326 మంది కలుపుకుని 2,87,845 మందికి ప్రతి నెలా రూ.85.64 కోట్ల లబ్ధి చేకూరనుంది.

అదనంగా రూ.5.84 కోట్ల లబ్ధి

ప్రభుత్వం తాజాగా పెంచిన పింఛన్ మొత్తంతో జిల్లా వ్యాప్తంగా అదనంగా రూ.5.84 కోట్ల లబ్ధి చేకూరనుంది. జిల్లాలో మొత్తం పింఛన్లు 2,87,845 ఉండగా వీరిలో 2,33,726 మందికి పెంచిన పింఛన్ మొత్తం అందనుంది. వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకార, కల్లుగీత, చర్మ కార్మికులు, ఒంటరి మహిళలకు పెంచిన పింఛన్ మొత్తం అందనుంది. జిల్లాలో ఇతర పెన్షన్‌దార్లు 44,793 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 8 వరకూ వైఎస్ఆర్ పెన్షన్ కానుక అందించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఇంటికి పెద్ద కొడుకులా



ఇంటికి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పని చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ కానుక అందిస్తున్నారు. అన్న మాట పింఛన్ మొత్తాన్ని నేడు రూ.3 వేలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్ బాబే ముఖ్యమంత్రి కావాలి.

– మెండెం నిర్మలా దేవి, లబ్ధిదారురాలు, ముప్పవరం, దెందులూరు మండలం

ఠంఛనుగా పింఛన్



ప్రతీ నెలా ఒకటో తేదీనే పింఛన్‌ను వలంటీర్లు ఇంటికి తీసుకొచ్చి ఇస్తున్నారు. నాలాంటి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారం ఎంతగానో ఉపయోగపడుతుంది. గతానికి భిన్నంగా అడక్కుండానే ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు.

– కడిమి సువర్ణ, లబ్ధిదారురాలు, కంద్రిగ నరసింహపురం, దెందులూరు మండలం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



పింఛన్ మొత్తాన్ని విడతలవారీగా రూ.3 వేలు చేసి ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న గొప్ప సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. గత నాయకులకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చడం అభినందనీయం.

– నబ్బువరపు దుర్గ మల్లేశ్వరరావు, లబ్ధిదారుడు, ఏలూరు

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు



జిల్లాలో అర్హత ఉన్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లు, మత్స్య, చర్మకారులు, వివిధ ప్రతిభావంతులకు పింఛన్లు అందిస్తున్నారు. జిల్లాలో 9,326 పింఛన్లు కొత్తగా అందజేస్తున్నాం. మొత్తం పెంపుదలతో జిల్లాలో రూ.5.84 కోట్ల మేర అదనపు లబ్ధి చేకూరనుంది.

– ఆర్.విజయరాజు, పీడీ, డీఆర్‌డీఏ, ఏలూరు జిల్లా



ఏలూరు : ఏలూరు మార్కెట్‌లో నూతన సంవత్సర కొనుగోళ్లు

కొత్త వత్సరం.. కోలాహలం

హ్యాపీ న్యూఇయర్ అంటూ ఆనందోత్సాహాలు మిన్నంటాయి.. కొత్త సంవత్సర వేళ సంబరాలు అంబరాన్నంటాయి.. ఏలూరు జిల్లావ్యాప్తంగా న్యూఇయర్ సందడి కనిపించింది. ఊరూవాడా విద్యుత్ కాంతులు, బాణసంచా కాల్పులు, రంగవల్లుల శోభతో అలరించాయి. జిల్లావాసులు మదినిండా మధుర స్మృతులతో 2023కు ఘనంగా వీడ్కోలు పలుకుతూ.. కోటి ఆశలతో 2024కు నవ వసంతం.. కావాలి మన సొంతం అంటూ స్వాగతం పలికారు.

– సాక్షి నెట్‌వర్క్







దెందులూరు : కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థులు 2024కు వినూత్నంగా స్వాగతం పలికారు. వందలాది మంది విద్యార్థులు 2024వ సంవత్సరం ఆకృతిలో ఒదిగి ఆకట్టుకున్నారు.

సాబ్జి చిరస్మరణీయుడు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ దివంగత సాబ్జి చిరస్మరణీయుడని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కొనియాడారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన షేక్ సాబ్జి సంస్మరణ సభ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. మోషేన్ రాజు మాట్లాడుతూ శాసన మండలిలో ఉద్యోగ, ప్రజా సమస్యలపై సాబ్జి ప్రస్తావించేవారని, ప్రశ్నించే ఉద్యమనేత అని కొనియాడారు. ఆయన అకాల మరణం దురదృష్టకరమన్నారు. సాబ్జి లేరనే నిజాన్ని నమ్మలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి నిమిషం వరకు ప్రజా ఉద్యమాలలోనే పనిచేశారని, ప్రజల కోసం పనిచేసిన ఆదర్శప్రాయుడని నివాళులర్పించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, కార్యదర్శి బి.సుభాషిణి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారికి తులసి సేవ



శ్రీవారికి సమర్పించేందుకు తులసి గజమాలను తీసుకొచ్చిన గోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపకురాలు సునీతా మధుసూదన్ దంపతులు

ద్వారకాతిరుమల: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని చినవెంకన్నకు నిత్యం తెల్లవారుజామున గోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపకురాలు సునీతా మధుసూదన్‌లు తులసి గజమాల (వనమాల)ను సమర్పిస్తున్నారు. గత ఎన్నిదేళ్లుగా ఈ సేవను కొనసాగిస్తున్నారు. హిందూధర్మ ప్రచారంలో భాగంగా శ్రీవారి ఆలయంతో పాటు ఈ ధనుర్మాసంలో ప్రముఖ వైష్ణవ ఆలయాలైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి, పెద్ద తిరుపతి గోవిందరాజ స్వామికి, మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహ స్వామికి ఈ తులసి గజమాలలను అందిస్తున్నారు. విజయవాడలోని భవానీపురానికి చెందిన సునీతా మధుసూదన్‌లు అక్కడున్న 10 ఎకరాల తోటలోని తులసిని సేకరించి, సేవకుల ద్వారా వాటిని గజమాలలుగా మలచి వైష్ణవాలయాలకు అందజేస్తున్నారు.

జనవరిలో టీఎల్ఎం మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికన ఆర్ట్, క్రాఫ్ట్ టీఎల్ఎం మేళాను జనవరిలో నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు. ఏలూరు జిల్లా పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డీఈఓ కార్యాలయంలో శ్యామ్‌సుందర్‌ను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ ఏలూరు జిల్లా అధ్యక్షుడు జీఎస్‌సీ బోస్, కన్వీనర్ నక్కా రజనీకాంత్ మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది పీటీఐలకు నెలవారీ గౌరవ వేతనాలకు సంబంధించిన బిల్లులను ప్రతి నెలా మండల విద్యాశాఖాధికారికి ఇవ్వడానికి ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. మహిళా ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవులు సాధ్యమైనంత త్వరలో అమలు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శ్యామ్ సుందర్ పీటీఐల సమస్యలను త్వరలోనే పరిష్కరనిస్తానని హామీ ఇచ్చారు. డీఈఓను కలిసిన వారిలో పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘం పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధులు బి. శ్రీనివాసు, బి.రవిబాబు తదితరులున్నారు.



డీఈఓ శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం అందచేస్తున్న పీటీఐ నాయకులు

మానవత్వం చాటిన ఏలూరు కలెక్టర్

ఏలూరు (మెట్రో): సెరెబ్రల్ పాల్సీ బాధిత బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించడమే కాక, బాలుడికి అవసరమైన ఉపకరణాలను సొంత సొమ్ముతో అందించి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మానవత్వాన్ని చాటారు. జగనన్నకు చెబుదాం.. స్పందన కార్యక్రమంలో పెదవేగి మండలం టి.గోకవరానికి చెందిన మాంద్రు చక్రవర్తి కలెక్టర్‌కు అర్జీనిస్తూ తన నాలుగేళ్ల కుమారుడు మాంద్రు లెమన్ స్టోన్‌కు పుట్టుకతో సెరెబ్రల్ పాల్సీ వ్యాధితో బాధపడుతున్నాడని, తన కుమారుడికి వైద్య సహాయం అందించాలని కోరారు. బాధిత బాలుడిని చూసి చలించిన కలెక్టర్ వెంటనే స్పందించి బాలుడికి అవసరమైన వైద్య సహాయం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. అంతేకాక బెంగళూరు నుంచి సొంత సొమ్ముతో కొనుగోలు చేసి రప్పించిన రూ.30 వేల విలువైన సీపీ వాకర్, డీబీ స్ప్లింట్, యూనివర్సల్ స్ప్లింట్‌తో కూడిన ఉపకరణాలను శనివారం రాత్రి కలెక్టరేట్‌లో బాలుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ బి.లావణ్య వేణిలకు మాంద్రు లెమన్ స్టోన్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. జేసీ బి.లావణ్యవేణి, పెదవేగి తహసీల్దార్ ఎస్.నాగరాజు పాల్గొన్నారు.


ప్రత్యేక ఉపకరణం అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్

ఆక్వా రైతులను కేంద్రం ఆదుకోవాలి

గణపవరం: ఆర్థిక నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రైతులను కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని పలువురు ఆక్వా రైతులు, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం ఫిష్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులకు మొరపెట్టుకున్నారు. ఫిష్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు ఎ.ఉదయ కుమార్, ఎంఆర్ఎస్ బాబు ఆదివారం గణపవరం ఆర్‌బీకేలో ఆక్వా రైతులతో సమావేశమై వారి సమస్యలను, ఆక్వా రంగంలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల జనవరి 2వ తేదీన ఆక్వా అభివృద్ధిపై చేపట్టిన సాగర పరిక్రమ కార్యక్రమంలో భాగంగా భీమవరంలో పర్యటించి ఆక్వా పరిశ్రమ సమస్యలపై రైతులతో చర్చించనున్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఫిష్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు వివిధ మండలాలలో పర్యటించి ఆక్వారంగ సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా రైతులు రొయ్యలకు గిట్టుబాటుధర కల్పించాలని, ఉచిత బీమా సదుపాయం కల్పించాలని, నాణ్యమైన సీడ్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని, కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఆక్వా రైతులకు రుణాలు అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. రైతులు తెలిపిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఫిషరీస్ అధికారి శివరామకృష్ణ, మత్స్యశాఖ సహాయకులు షర్మిలాదేవి, భాస్కర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


గణపవరం ఆర్‌బీకేలో కేంద్ర ప్రభుత్వ ఫిష్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులతో ఆక్వా రైతులు

పంగిడిగూడెంలో గోవా మద్యం స్వాధీనం

- 12 ఫుల్ బాటిల్స్, ఒక కారు సీజ్
- దాబా యజమాని అరెస్ట్

ద్వారకాతిరుమల: గోవా మద్యాన్ని కారులో తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. పంగిడిగూడెం పెట్రోల్ బంకు సమీపంలోని దాబాలో వేంపాడుకు చెందిన కొందరు వ్యక్తులు పార్టీ చేసుకుంటున్నారు. అయితే భీమడోలుకు చెందిన దాబా యజమాని వర్మ నల్లజర్ల నుంచి మద్యం బాటిళ్లను పంగిడిగూడెంకు తన కారులో తరలిస్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ అన్ని వాహనాలతో పాటు ఈ కారును తనిఖీ చేయగా, కారు డిక్కీలో 12 గోవా మద్యం బాటిళ్లు కనిపించాయి. దీంతో వర్మను అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామని, దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుధీర్ చెప్పారు.


కారు డిక్కీలో మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న సీఐ భీమేశ్వర రవికుమార్, ఎస్సై సుధీర్

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో వ్యక్తి మృతదేహం

కామవరపుకోట: రాజు నాగులపల్లిలోని ఓ మామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గుంటుపల్లి పంచాయతీ, కంఠమనేనివారిగూడెంలోని, రాజు నాగులపల్లిలో ఓ రైతు మామిడి తోటలో గుర్తుతెలియని వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందగా రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జయబాబు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడికి 25 నుంచి 30 ఏళ్ల లోపు వయసు ఉండవచ్చని, వివరాలు తెలిసిన వారు తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

తల్లికి అంత్యక్రియలు చేసిన తనయ

పాలకొల్లు సెంట్రల్: తల్లికి తలకొరివి పెట్టి కన్న రుణం తీర్చుకుంది ఓ కుమార్తె. వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లులో 22వ వార్డు కొత్తపేట ప్రాంతానికి చెందిన యర్రంశెట్టి బాపయ్య నాయుడు (న్యాయవాది), భార్య పుణ్యవతిదేవి (60) దంపతులకు చైతన్య ఒక్కతే కుమార్తె. బాపయ్య నాయుడు అనారోగ్యంతో లేవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో భార్య పుణ్యవతిదేవి శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో గుండెనొప్పితో మృతి చెందింది. కుమార్తె చైతన్య అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఇటీవల హైదరాబాద్‌కు షిఫ్ట్ అయింది. ఆదివారం తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె వెంటనే హైదరాబాద్ నుంచి పాలకొల్లు చేరుకుంది. తండ్రి మంచంపై లేవలేని స్థితిలో ఉండటం, సోదరులు లేకపోవడంతో అన్నీ తానై తల్లి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించింది.

ఏఎస్పీ సుబ్బరాజుకు సన్మానం

భీమవరం: ప్రజల మన్నన పొందేలా ఏఎస్పీ సుబ్బరాజు సేవలందించారని ఎస్పీ రవిప్రకాష్ అన్నారు. బదిలీ అయిన సందర్భంగా భీమవరంలో ఆదివారం ఏఎస్పీ సుబ్బరాజు దంపతులను ఎస్పీ సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి అమలులోకి 30 పోలీస్ యాక్ట్

భీమవరం: జిల్లాలో జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రవిప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయము
ఏలూరు జిల్లా ::: ఏలూరు.

ఏలూరు జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయములో ఒక సంవత్సరము తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయు నిమిత్తం ఒక (1) డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీ చేయుటకు ఏలూరు జిల్లా అధికారిక వెబ్‌సైట్ నందు 22.11.2023 తేదిన జిల్లా కలెక్టర్ వారు నోటిఫికేషన్ జారి చేసి ది.27.11.2023 తేదిన సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడినవి. సదరు స్వీకరించిన దరఖాస్తులో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు 423 మంది అభ్యర్థుల యొక్క దరఖాస్తులు స్వీకరించబడినవి. కావున, డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తు చేసిన 423 మంది అభ్యర్థులు అందరు వారి యొక్క ఒరిజినల్ విద్యా అర్హత ధ్రువపత్రములతో మరియు వారి విద్యా అర్హతల ధ్రువపత్రములపై అటెస్టేషన్ చేసిన జిరాక్స్ కాపీతో సహా శ్రీయుత ఏలూరు జిల్లా కలెక్టర్ వారి ప్రాంగణం నందు గల గోదావరి సమావేశ మందిరం నందు ది.02.01.2024 తేదిన ఉదయం 10.00 గంటలకు వ్యక్తిగతంగా హాజరు కావల్సిందిగా సదరు దరఖాస్తుదారులు అందరికి శ్రీ జిల్లా ఎంపిక కమిటీ ఛైర్మన్ మరియు జిల్లా సంయుక్త కలెక్టర్ & ఇ.డి.ఈ.డి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, ఏలూరు వారు ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తున్నారు. కావున, అభ్యర్థులు పేర్కొన్న తేదిలో తప్పకుండ హాజరు కావలెను.

సం/- బి.లావణ్య వేణి IAS,
జాయింట్ కలెక్టర్ & ఇ.డి.ఈ.డి.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, ఏలూరు

స్థలం : ఏలూరు.
తేది : 31.12.2023